మళ్లీ దరఖాస్తుల జాతర..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం మంగళవారం ప్రత్యేకాధికారుల సమక్షంలో నిర్వహించిన గ్రామసభలు కొన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా నిర్వహించగా, మరికొన్ని ప్రాంతాల్లో రసాభాసగా జరిగాయి. ఇప్పటికే నాలుగు పథకాల కోసం గుర్తించిన లబ్ధిదారుల జాబితాలను ఆయా డివిజన్లు, గ్రామాల్లో వెల్లడించగా.. వాటిని చూసుకున్న వారిలో పేర్లు లేని వారు మండిపడడం కనపడింది. ఈనేపథ్యాన ప్రజాపాలనలో దరఖాస్తులు చేశాం.. ఇంటింటి సర్వేల్లో సైతం తమ సమగ్ర వివరాలు చెప్పాం.. ప్రభుత్వ పథకాలకు తాము అర్హులమైనప్పటికీ జాబితాల్లో తమ పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. అధికారుల తీరుపై తప్పుపట్టడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి.

నిరంతర ప్రక్రియ



పండితాపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందొద్దని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం కొమ్మినేపల్లి జీపీ కార్యాలయంలో ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన నాలుగు గ్యారంటీల ప్రాథమిక లబ్ధిదారుల గుర్తింపు జాబితాపై నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులందరికీ ఈ నెల 26 నుంచి రాజకీయాలకు అతీతంగా అందిస్తుందని, అర్హులై ఉండి, కార్డులు రానివారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండాయిగూడెం, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ఇల్లెందు ఏఎంసీ చైర్మన్ రాంబాబు, మండల ప్రత్యేకాధికారి మధుసూదన్, తహసీల్దార్ సుధాకర్, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్, నాయకులు గింజల నరసింహారెడ్డి, మద్దినేని రమేశ్‌బాబు, ధరావత్ అనురాధ, బానోత్ నరసింహానాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, మహేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నా పేరు ఉందా లేదా..?!



ఖమ్మం 6వ డివిజన్ వార్డు సభలో జాబితాలోని పేర్లు చదువుతుండగా ఆసక్తి వింటున్న లబ్ధిదారులు

రఘునాథపాలెం: ప్రభుత్వ పథకాల ఎంపికలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యాన మంగళవారం గ్రామసభలు నిర్వహించి ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారుల జాబాతాలను ఆయా గ్రామాల నోటీస్ బోర్డులో అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఆ జాబితాలో తమ పేరు ఉందా లేదా? అని ఆత్రుతగా చూసుకోవడం కనబడింది. పేర్లు లేని వారు అక్కడే ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా అందించేందుకు అర్హత పత్రాల జిరాక్స్‌లతో క్యూలో ఇలా నిలబడ్డారు.

లబ్ధిదారుల ఆందోళన..

కూసుమంచి: నాలుగు ప్రభుత్వ పథకాల అర్హుల ఎంపిక కోసం మంగళవారం భగవత్ వీడు, చేగొమ్మ, గట్టుసింగారం, కొత్తూరు, మునిగేపల్లి, నర్సింహులగూడెం, పెరికసింగారం, చౌటపల్లి, మల్లాయిగూడెం, నేలపట్ల, తురకగూడెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. తురకగూడెం గ్రామంలో జరిగిన సభలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ పాల్గొనగా గట్టుసింగారం గ్రామంలో జరిగిన సభలో మండల ప్రత్యేకాధికారి శ్రీలత, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా గట్టుసింగారం సభలో అర్హులైనప్పటికీ తమ పేర్లు జాబితాలో లేవని పలువురు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారు కలుగజేసుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా.. వారు వినలేదు. పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకరాగా.. అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని, తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా ఆందోళన సద్దుమణిగింది. నర్సింహులగూడెం, మునిగేపల్లి గ్రామాల్లో కూడా పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

అరుపులు, కేకలతో..



కొత్తకొత్తూరులో నిరసన చేస్తున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: నాలుగు పథకాల కోసం మంగళవారం నిర్వహించిన గ్రామ సభలు అరుపులు, కేకల నడుమ జరిగాయి. మండలంలోని కొత్తకొత్తూరు, మోటాపురం, ఆచార్లగూడెం, అమ్మగూడెం, గువ్వలగూడెం, అనాసాగారం తదితర గ్రామాల్లో అర్హత కలిగిన వారికి జాబితాలో పేర్లు రాలేదని నిరసన చేపట్టారు. ఈనేపథ్యాన ప్రతీ గ్రామంలో రేషన్‌కార్డులు, ఇళ్ల కోసం భారీ ఎత్తున దరఖాస్తులు అందాయి. మోటాపురంలో జాబితాను మార్చేసి రీసర్వే చేయాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు వినతి పత్రాలు అందించారు. మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల పంచాయతీ అధికారి శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తుతో..

ఖమ్మంఅర్బన్: నగరంలో మంగళవారం జరిగిన గ్రామసభలు పోలీసు బందోబస్తు నడుమ కొనసాగాయి. ఈనేపథ్యాన నగరంలోని 3వ డివిజన్‌లో జరిగిన గ్రామసభలో ఒకే ఇంట్లో ముగ్గురిని పథకాల కోసం ఎంపిక చేశారని, ఇందిరమ్మ ఇళ్లు ఒకే ఇంట్లో ముగ్గురు, నలుగురికి ఎలా వస్తాయని అధికారులను ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అడ్డుకుని సర్దిచెప్పి దరఖాస్తులు చేసుకోవాలని శాంతింపజేశారు. ఇలా నగరంలోని 1 నుంచి 20 డివిజన్లలో జరిగిన సభల్లో ఇదే తరహాలో అధికారుల తీరుపై మండిపడ్డారు. సభలో పాల్గొన్న అధికారులు మాత్రం ఇది కేవలం లబ్ధిదారుల జాబితాలనే అని, పరిశీలించిన తర్వాత అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈసభలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

అపోహలకు గురికావొద్దు..



పిండిప్రోలు గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ నర్సింహారావు

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న ప్రారంభించే సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అమలు జరుగుతాయని, ప్రజలు అపోహలకు గురికావొద్దని ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు అన్నారు. మండలంలోని పిండిప్రోలులో జరిగిన గ్రామసభలో పాల్గొని ప్రజల వినతులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, జేడీఏ ధనసిరి పుల్లయ్య, తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని రఘునాథపాలెంతో పాటు మరికొన్ని గ్రామాల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు రాలేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు సూచించారు. ఈనేపథ్యాన మండలంలోని 15 గ్రామాల్లో జరిగిన గ్రామసభలు ప్రశాంతంగా జరిగేలా మండల ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

టీజీటీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్(టీజీటీటీఎఫ్) జిల్లా కమిటీ సమావేశం నగరంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోతు రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం వయస్సు పెంపు ఆలోచనను విరమించుకోవాలన్నారు. అనంతరం టీజీటీటీఎఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అజ్మీర బన్సీలాల్, బాణోత్ జగ్గిలాల్‌ను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భీమ్‌సింగ్, బన్సీలాల్, బిచ్చా, బాబురావు, అజ్మీరా వీరునాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో ఓ వివాహిత అదృశ్యమైనట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో పడుకున్న తర్వాత తెల్లవారి నిద్ర లేచేసరికి లేదని, చాలా చోట్ల ఆరా తీసినా ఎక్కడా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొనగా, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠశాల సందర్శన

కామేపల్లి: మండలంలోని టేకులతండా పాఠశాలను ఖమ్మం ఐటీడీఏ పీఎంఆర్‌సీ ఏసీఎంఓ ఎల్.రాములు, ఎస్సీఆర్‌పీ బి.బాల మంగళవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని, పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.రాజేశ్వరి, సపావట్ కిషన్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ఖమ్మంక్రైం: డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఏఎంవీఐ ఆర్.స్వర్ణలత అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మంగళవారం రవాణశాఖ ఆధ్వర్యాన లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఏఎంవీఐలు వి.గోపికృష్ణ, సుమలత, కానిస్టేబుల్స్ రమేష్, సరిత పాల్గొన్నారు.

‘శ్రీ చైతన్య’లో క్రీడా వేడుకలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పుట్టకోట రోడ్డులోని శ్రీ చైతన్య గ్లోబల్ విస్తా స్కూల్‌లో ఈనెల 24, 25వ తేదీల్లో ‘ఉడాన్’పేరిట క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్లను డీజీఎం చేతన్ మాథూర్‌లో కలిసి ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. బాస్కెట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ జయసుధ, ఏజీఎం బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: ఇంగ్లిష్ చదవడం, మాట్లాడడంలో తర్ఫీదు ఇవ్వడం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యాన ఖమ్మం డీపీఆర్‌సీ భవనంలో జరిగిన జిల్లా స్థాయి తెలంగాణ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లిష్‌లో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఈమేరకు విద్యార్థులను ప్రోత్సహిస్తూ మెరుగైన బోధన చేయాలని తెలిపారు. అనంతరం 26మంది ఆంగ్ల ఉపాధ్యాయులను కలెక్టర్ సన్మానించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఈఓ సోమశేఖరశర్మ, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, సీఎంఓ రాజశేఖర్, ఎల్టా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జక్కంపూడి జగదీష్, బత్తిని రామనాథంతో పాటు శ్రీనివాసరావు, సువర్ణ ప్రసాద్, భాస్కర్, నెల్లూరి నాగేశ్వర్‌రావు, షఫీ, ముజీబ్, దారా రాజేష్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించారు.

జల్లేపల్లి విద్యార్థినికి ద్వితీయ స్థానం..

తిరుమలాయపాలెం: ఖమ్మంలో నిర్వహించిన ఇంగ్లిష్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలో మండలంలోని జల్లేపల్లి పాఠశాల విద్యార్థిని మేకల జ్ఞానేశ్వరి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవగా.. పాఠశాల హెచ్‌ఎం దారా రాజేష్ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు పార్థసారథి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థుల ప్రతిభ..

రఘునాథపాలెం: ఇంగ్లిష్ ఒలంపియాడ్ పోటీల్లో రఘునాథపాలెం కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి వై.లత తెలిపారు. ఈపోటీ పరీక్షలో భవ్యశ్రీ జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలవగా, దర్శిని మూడోస్థానంలో నిలిచిందన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు సౌజన్య, ప్రశాంతిలతో పాటు ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఈఓ రాములు, ప్రత్యేకాధికారి అభినందించారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నగర కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: నాయీ బ్రాహ్మణ సంఘం ఖమ్మం నగర అధ్యక్షుడిగా వేములపల్లి చంద్రమౌళీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సింగారపు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాచమళ్ల జానీ, నామవరపు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా దూళిపాల ఉపేందర్‌లు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న, ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్‌లు ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సమాఖ్య సంక్షేమ సేవా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ నియామకం జరిగింది. మాదారపు హరినాథ్, వెంకటప్పయ్య, రవి, మధు, నరేష్, జంపాల రామకృష్ణ, రామారావు,రవి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

తిరుమలాయపాలెం: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంతవరకు పురోగతి లేదని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితవాడల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సోమపాంగు రాము, దాసరి మహేందర్‌లతో పాటు మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, నాయకులు సురేష్, గోపోజు రవి, పల్లి రమేష్, బొజ్జ ముత్తయ్య, ఉప్పలయ్య, భాషపొంగు మధు, వెంకన్న,కొమ్ము నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: ఈ నెల 24న మంచిర్యాల పట్టణంలో నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ రాష్ట్ర ఐక్యత విలీన సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని బచ్చోడులో పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ఖమ్మం జిల్లా నాయకురాలు బింగి సుధా, వెంకటమ్మ, దుర్గమ్మ, సోమమ్మ, ఉప్పమ్మ, నాగమణి, నాగేంద్ర, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టిజన్ల దీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఒకే సంస్థలో పనిచేసే ఉద్యోగులకు రెండు రకాల విధివిధానాలను వ్యతిరేకిస్తూ, తమను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టిజన్లు చేస్తున్న నిరాహార దీక్ష కొనసాగుతున్నాయి. ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ఈ దీక్షలను మంగళవారం ఆర్టిజన్ల జేఏసీ ప్రతినిధి గంటా శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ దీక్షలో అన్వర్, ఉపేందర్, నరేష్, నాగరాజు, కృష్ణారావు, కోటేశ్వరరావు, నరసింహారావు, సైదులు, గోపి, ఆనందరావు, శ్రీకాంత్, నరేందర్, సాంబశివరావు, సతీష్, నరేష్ బాబు, బషీరుద్దీన్, టి.నాగేశ్వరరావు, రవి, హరినారాయణ పాల్గొన్నారు. యూఈఈయూ(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, 1535 నాయకులు కె.శ్రీనివాసరావు తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

- ఖమ్మం సహకారనగర్: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రకటించిన డిప్లొమా ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మంరూరల్: సాంఘిక శాస్త్రం ప్రతిభా పాటవ రాష్ట్రస్థాయి పరీక్షలో మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.వెన్నెల మార్కులు(91) సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల హెచ్‌ఎం ఎం. శ్యాంసన్ తెలిపారు. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ పోటీలు నిర్వహించగా ప్రథమ స్థానంలో నిలిచి ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం, రూ.5వేల నగదు అందుకుంది.

ఆశాల పాదయాత్ర

ఖమ్మంమయూరిసెంటర్: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యాన మంగళవారం ఆశ కార్యకర్తలు పాత కలెక్టరేట్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. కోలాటాలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్ రావు, పి.రమ్య, శీలం నర్సింహరావు, మల్లూరి చంద్రశేఖర్, జె.మంగమ్మ, అమల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ ఇవ్వాలి

ఖమ్మంలీగల్: జార్ఖండ్ రాష్ట్ర కౌన్సిల్ తరహాలో 30 ఏళ్ల ప్రాక్టీస్ చేసిన సీనియర్ న్యాయవాదులకు తెలంగాణ బార్ కౌన్సిల్ కూడా పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని కోరుతూ న్యాయవాది తాళ్లూరి దిలీప్ బార్ కౌన్సిల్ సెక్రటరి నాగమణికి వినతి పత్రం అందజేశారు. అలాగే 35 ఏళ్ల లోపు న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకుని.. వెల్ఫేర్ ఫండ్ కట్టే న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ యాక్ట్‌ను సవరించి అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై బార్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించేలా చూడాలన్నారు. హైకోర్టు న్యాయవాది లక్ష్మీకనకవల్లి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు మంగళవారం బహుమతుల అందించారు. స్థానిక మహిళా కళాశాల ఆవరణలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు, ఖమ్మం నగర 36వ డివిజన్ కార్పొరేటర్, క్లబ్ సభ్యుల ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహించగా.. వాసవీ క్లబ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, ఇమ్మిడియేట్ పాస్ట్ గవర్నర్ గుమ్మడివెల్లి శ్రీనివాసరావులు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ క్యాబినెట్ వైస్ గవర్నర్ మాడిశెట్టి వరప్రసాద్, క్యాబినెట్ ట్రెజరర్ గుంటుపల్లి దివాకర్ గుప్తా, కల్బ్ కార్యదర్శి వెచ్చ కృష్ణమోహన్, కోశాధికారి పసుమర్తి శ్రీనివాస్, బోడవరపు పండరీ, పసుమర్తి సుధాకర్, బచ్చు ప్రసాదరావు, మేళ్లచెరువు శ్రావణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన రెమ్యూనరేషన్ వెంటనే మంజూరు చేయాలని ఖమ్మం అర్బన్ మండల పీఆర్‌టీయూ అధ్యక్ష కార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, బి.రవికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒక పూట పాఠశాలకు వెళ్లి, మరో పూట సర్వేలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసినా నేటికీ పారితోషకం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పారుపల్లి వెంకటేశ్వరరావు, మరీదు రాములు, అచ్యుతరావు, నవీన్ కుమార్, మురళీకృష్ణ, గోపాలస్వామి, సత్యనారాయణ, రంగారావు, ధనలక్ష్మి, వెంకటకుమారి, సునీత, నాగేంద్రమ్మ, కరుణ, ఝాన్సీరాణి, నాగమణి పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు నెలకు రూ.2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని, తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన నిర్వహించగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా తగినన్ని బస్సులు లేవని, మహిళల పట్ల ఇప్పటికీ వివక్ష సాగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు మొదలు రక్షణ వరకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసిన వ్యక్తికి మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య నిర్మాణ మహాసభలను ఫిబ్రవరి మొదటి వారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షురాలు తాటి నిర్మల, ప్రమీల, రజిత, మమత, సరోజినమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు రుణాలు ఇవ్వాలని ఆందోళన

ఖమ్మం మామిళ్లగూడెం: పేద ప్రజల ఇళ్ల స్థలాలకు రుణాలు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎంఏ.జబ్బార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం వన్‌టౌన్ కమిటీ ఆధ్వర్యాన నగర పాలక కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖమ్మంలోని శివాయిగూడెం, పువ్వాడ ఉదయనగర్ సర్వే నంబర్ 192లో గత ప్రభుత్వం 2009లో ఇచ్చిన ఇల్లు, ఇళ్ల స్థలాల వారికి రూ.5లక్షల రుణాలు అందించాలని, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీళ్ల సౌకర్యం, కరెంట్ మీటర్లు ఏర్పాటు చేసి న్యాయం చేయాలన్నారు. అనంతరం సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి నాగులమీరా మాట్లాడాక కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి, నాగిశెట్టి యాదగిరి, కూరపాటి శ్రీను, గట్టుగిరి, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు బేగం, దాసరి నాగేశ్వరరావు, ధనాలకోట రవికుమార్, షేక్.ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

చెరువుకట్ట.. దాటేదెట్లా?



గుంతలు, పిచ్చి చెట్లతో ప్రమాదకరంగా ఉన్న చెరువుకట్టపై రోడ్డు

ప్రమాదకరంగా వేపకుంట్ల చెరువుకట్టపై రోడ్డు

- అరకిలోమీటర్ వరకు గుంతలు
- అదుపుతప్పుతున్న వాహనాలు
- రాత్రిళ్లు భయానకంగా ప్రయాణం
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి నాలుగైదు గ్రామాలు, పంట పొలాలకు ప్రధాన లింక్‌రోడ్డుగా ఉన్న వీవీపాలెం నుంచి చింతగుర్తి, గణేశ్వరం వెళ్లే రోడ్డులో వేపకుంట్ల చెరువుకట్టపై నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంది. అసలే చెరువు కట్ట, ఆపై సింగిల్ రోడ్డు కావడంతో రోడ్డంతా ధ్వంసమై గుంతలు పడి ప్రయాణం పెద్ద ప్రయాసగా మారింది. నిత్యం ఈ రోడ్డుపైనే ప్రజలు, విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం ఖమ్మానికి రావాల్సి ఉంది. జిల్లా కేంద్రానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ చెరువు కట్టపై ప్రయాణమంటే ప్రాణాలతో చెలగాటమే అని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు.

అర కిలోమీటర్ ఆగమాగం..

చెరువు కట్టపై నిత్యం గణేశ్వరం, చింతగుర్తి, వేపకుంట్ల, మల్లేపల్లి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈనేపథ్యాన చెరువు కట్ట మినహా మిగతా రోడ్డంతా బాగానే ఉంది. కాని వేపకుంట్ల నుంచి చెరువు అలుగు దాటే అర కిలోమీటర్ వరకు గుంతలు పడి ప్రయాణం నరకయాతనగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. గుంతలు, కంపచెట్లతో మార్జిన్‌లు కనపడకపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు.

అలుగు దాటేదాక..

గత రెండు నెలలు క్రితం ఇదే దారిలో ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు సైతం చెరువుకట్ట దాటే క్రమంలో పక్కకు దూసుకెళ్లి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఈరోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలను దాటి పోవాలన్నా గుంతలతో పాటు సరైన వెడల్పు లేకపోవడం , మార్జిన్‌లో మట్టి కొట్టుకుపోవడంతో పక్కకు జరగాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడపాల్సి వస్తుంది. ఇక రాత్రి అయితే కట్ట దాటే వరకూ క్షణం క్షణం భయంగానే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తమ బాధలను గుర్తించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లు తొలగించి, గ్రావెల్ వేసి చదును చేసి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు వేడుకుంటున్నారు.



పేరుకే తారురోడ్డు..



చెరువుకట్టపై తారు రోడ్డు పేరుకే అన్నట్లుగా ఉంది. గుంతలతో ప్రయాణం నరకంగా ఉంది. రైతులు, కూలీలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. పగలే ప్రయాణించలేని ఈ రోడ్డులో రాత్రి అయితే మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– పొట్టపల్లి రాజా, వేపకుంట్ల

రోడ్డును బాగు చేయాలి..



వేపకుంట్ల చెరువుకట్టపై నుంచి ఖమ్మం వెళ్లి రావడం అంటేనే నరకంగా ఉంది. గుంతలు పడిన రోడ్డు, జారిపోయిన చెరువు కట్ట అంచులు, పెరిగిన కంపచెట్లతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉంది. పాలకులు, అధికారులు మా బాధలను గుర్తించి రోడ్డును బాగు చేయాలి.

– మాలోత్ రాంబాబు, చింతగుర్తి